
నేటి కష్టమే
రేపటి
ప్రతిఫలం.

sahanamvande.com

# సహనం వందే

సోమవారం | 28-04-2025 సంచిక : 39 EDITOR: ROHINI







# మొఘులుల చరిత్రకు మంగళం

**కేంద్ర ప్రభుత్వం ఎన్సీఈఆర్టీ ఏడో తరగతి పాఠ్యపుస్తకాలను పూర్తిగా మార్చడం సంచలనంగా మారింది. ఈ పుస్తకాల్లో అనేక మార్పులు చేర్పులు చేశారు. నూతన పాఠ్య పుస్తకాల్లో మొఘల్ చక్రవర్తులు, ఢిల్లీ సుల్తానేట్‌కు సంబంధించిన సమస్త చరిత్రను తొలగించింది. 'భూమి ఎలా పవిత్రమవుతుంద'నే కొత్త చాప్టర్ ను పొందుపరిచారు. ఈ చాప్టర్లో హిందూ, బౌద్ధ, సిక్కు, ఇస్లాం, క్రైస్తవ, జుడాయిజం, జోరాస్ట్రియన్ మతాలకు సంబంధించిన వివరాలు ఉంటాయి. అలాగే భారత్ సహా ఇతర దేశాల్లోని పవిత్ర స్థలాలు, తీర్థయాత్రలపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ అధ్యాయంలో 12 జ్యోతిర్లింగాలు, చార్ ధామ్ యాత్ర, శక్తి పీఠాలు వంటి పవిత్ర స్థలాల కూటమిని, నదీ సంగమాలు, పర్వతాలు, అడవులు వంటి పవిత్రంగా భావించే ప్రదేశాలను వివరిస్తుంది. - సహనం వందే, ఢిల్లీ**

## ఏడో తరగతి ఎన్సీఈఆర్టీ పుస్తకాల్లో కీలక మార్పులు

- మహా కుంభమేళా... 66 కోట్ల మంది పాల్గొన్న వివరాలకు ప్రాధాన్యం
- 12 జ్యోతిర్లింగాలు... చార్ ధామ్ యాత్ర... శక్తి పీఠాల జోడింపు
- 'భూమి ఎలా పవిత్రమవుతుంద'నే చాప్టర్లో అన్ని మతాల ప్రస్తావన
- విద్య కాషాయీకరణగా ప్రతిపక్షాల మండిపాటు

### రెండు భాగాలుగా నూతన పుస్తకాలు...

ఈ వారం విడుదలైన నూతన పాఠ్యపుస్తకాలు మొదటి భాగాన్ని కలిగి ఉన్నాయి. రాబోయే నెలల్లో రెండో భాగం విడుదల కానుంది. అయితే తొలగించిన మొఘలులు, ఢిల్లీ సుల్తానేట్ భాగాలు రెండో భాగంలో ఉంటాయా లేదా అనే విషయంపై ఎన్ సీఈఆర్టీ అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇదిలా ఉండగా 2022-23లో కోవిడ్ మహమ్మారి సమయంలో పాఠ్యాంశాల భారాన్ని తగ్గించే క్రమంలో తుగ్లక్, ఖిల్జీ, మమ్లూక్, లోడీ వంశాలు, మొఘల్ చక్రవర్తుల విజయాలకు సంబంధించిన విస్తృతమైన సమాచారం ఇప్పటికే తగ్గించారు. కానీ నూతన పాఠ్య పుస్తకంలో వీటికి సంబంధించిన అన్ని ప్రస్తావనలను పూర్తిగా తొలగించారు.

### ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు ప్రాధాన్యం...

సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకం 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్'లో మగధ, మౌర్య, శాతవాహన వంటి ప్రాచీన భారతీయ రాజవంశాల గురించి భారతీయ ధర్మం ప్రాముఖ్యతను తెలిపే నూతన అధ్యాయాలు చేర్చారు. పాఠ్యపుస్తకంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యను కూడా చేర్చారు. అందులో ఆయన భారతదేశాన్ని బద్రీనాథ్, అమర్‌నాథ్‌ల మంచు శిఖరాల నుండి కన్యాకుమారి వరకు తీర్థయాత్రల భూమిగా అభివర్ణించారు. ఈ ఏడాది ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా గురించి కూడా ప్రస్తావన ఉంది. ఆ మేళాలో సుమారు 66 కోట్ల మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. అయితే ఆ మేళాలో 30 మంది యాత్రికులు మరణించిన తొక్కిసలాట గురించి మాత్రం ఎటువంటి సమాచారం లేదు.

### వర్ణ వ్యవస్థ... జాతీయ పతాకం

పాఠ్యపుస్తకంలో వర్ణ-జాతి వ్యవస్థ మొదట్లో సమాజానికి స్థిరత్వాన్ని అందించినప్పటికీ, బ్రిటిష్ పాలనలో దాని కఠిన నిర్ణయాల వల్ల సమానత్వం తగ్గిపోయిందని పేర్కొన్నారు. అటల్ సొరంగం, భారత రాజ్యాంగం వంటి అంశాలతో పాటు, 2004లో ఒక పౌరుడు జాతీయ జెండాను తన ఇంటి వద్ద ఎగురవేయడం తన హక్కు అని కోర్టులో సవాలు చేసిన సంఘటనను కూడా ప్రస్తావించారు. ఈ కేసులో సుప్రీంకోర్టు... జెండాను ఎగురవేయడం భావప్రకటనా స్వేచ్ఛలో భాగమని తీర్పునిచ్చింది.


### ఆంగ్ల పాఠ్యపుస్తకంలో...

ఆంగ్ల పాఠ్యపుస్తకంలో ఉన్న 15 కథలు, కవితలు, వివరణాత్మక రచనలలో 9 భారతీయ రచయితలవి లేదా భారతీయ నేపథ్యం, పాత్రలు కలిగినవి ఉన్నాయి. ఇందులో రవీంద్రనాథ్ టాగూర్, ఏపీజే అబ్దుల్ కలాం, రస్కిన్ బాండ్ వంటి ప్రముఖుల రచనలు ఉన్నాయి. గతంలోని హనీకోంబ్ పాఠ్య పుస్తకంలో ఉన్న 17 రచనలలో కేవలం 4 మాత్రమే భారతీయ రచయితలవి కావడం గమనార్హం. ఈ మార్పులపై ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. విద్య 'కాషాయీకరణ'గా విమర్శిస్తున్నాయి. మార్పులు చేర్పులు చేసిన పుస్తకాలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్నాయి.

# భారతి సిమెంట్స్ గోవింద

- బాలాజీ గోవిందప్ప దొరికితే భారతికి ముప్పు
- డైరెక్టర్‌గా గోవిందప్ప కీలక బాధ్యతలు
- లిక్కర్ స్కామ్‌లో వెలుగులోకి రహస్యాలు?





**సహనం వందే, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ స్కామ్‌లో కీలక పాత్రధారిగా భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ పేరు తెరపైకి వచ్చింది. తాడేపల్లిలో ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. బాలాజీని అజ్ఞాతంలో దాచినట్లు వార్తలు వస్తుండగా, ఆయన దొరికితే భారతి సిమెంట్స్‌తో పాటు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి రెడ్డికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు బయటపడతాయన్న ఆందోళన వైసీపీ వర్గాల్లో నెలకొంది.

### మద్యం స్కామ్‌లో బాలాజీ కీలక భూమిక...

వైసీపీ హయాంలో మద్యం కుంభకోణంలో రూ. 50-60 కోట్ల మొత్తం ప్రతినెలా కంపెనీలు, డిస్టిలరీల నుంచి వసూలు చేసినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ మొత్తం గోవిందప్ప బాలాజీ, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డికి చేరేదని రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో సీఐడీ స్పష్టం చేసింది. ఈ ఆర్థిక లావాదేవీలను జగన్ సతీమణి భారతిరెడ్డి తరఫున బాలాజీ చక్కదిద్దినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్ రూపకల్పనలో బాలాజీ కీలక భాగస్వామిగా ఉన్నట్లు సీఐడీ గుర్తించింది.

### భారతి సిమెంట్స్‌లో రహస్య ఆర్థిక ప్రవాహం...

గోవిందప్ప బాలాజీ భారతి సిమెంట్స్ ఆర్థిక వ్యవహారాలను నిర్వహించే కీలక వ్యక్తిగా పనిచేశారు. ఈ కంపెనీలోకి భారీ మొత్తంలో నిధులు ప్రవహించినట్లు సీఐడీ అనుమానిస్తోంది. ఈ నిధుల మూలం ఏమిటన్నది ఇంకా రాబట్టాల్సి ఉంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, భారతి సిమెంట్స్‌లో 51 శాతం వాటాలు ఫ్రాన్స్‌కు చెందిన వికాట్ కంపెనీ కొనుగోలు చేసినప్పటికీ, కంపెనీ నిర్వహణ పూర్తిగా భారతి రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. దాదాపు రూ. 2,000 కోట్లు పెట్టుబడి పెట్టిన వికాట్ కంపెనీ నిర్వహణలో పాల్గొనకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### బాలాజీ అజ్ఞాతంలోకి.. తాడేపల్లిలో టెన్షన్

ప్రభుత్వం మారిన తర్వాత లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి రావడంతో, సీఐడీ దర్యాప్తు తమ వరకు చేరుతుందన్న భయం వైసీపీ నాయకుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో గోవిందప్ప బాలాజీని తాడేపల్లిలోని అత్యున్నత వర్గాలు అజ్ఞాతంలోకి పంపినట్లు సమాచారం. బాలాజీ దొరికితే, భారతి రెడ్డి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన రహస్యాలు బయటపడతాయని, అవి జగన్మోహన్ రెడ్డిని కూడా ఇబ్బంది పెట్టవచ్చని వైసీపీ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సీఐడీ వద్ద బాలాజీ బయోడేటా...

గోవిందప్ప బాలాజీ కామర్స్‌లో డిగ్రీ, చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) పట్టా పొందిన వ్యక్తి. ఆర్థిక, ఐటీ రంగాల్లో దాదాపు 20 ఏళ్ల అనుభవం ఉన్న ఆయన, భారతి సిమెంట్స్‌లో జీవితకాలపు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ అనుభవం ఆయనను ఆర్థిక లావాదేవీలను నిర్వహించడంలో నిపుణుడిగా మార్చింది. అదే సమయంలో సీఐడీ దర్యాప్తులో ఆయన కీలకంగా ఉన్నారు.

### భారతి సిమెంట్స్ సీజ్ అవుతుందా?

గోవిందప్ప బాలాజీ దొరికి భారతి సిమెంట్స్‌లోకి ప్రవహించిన నిధుల మూలాన్ని సీఐడీ బయటపడితే, కంపెనీ సీజ్ అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారం వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి చెందిన ఆర్థిక సామ్రాజ్యంపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. సోషల్ మీడియాలో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది, కొందరు బాలాజీ అరెస్ట్‌ను డిమాండ్ చేస్తుండగా, మరికొందరు ఈ వివాదాన్ని రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు.



# పేదల ఇళ్లు కూల్చొద్దు!

## నా కళ్ల ముందే రాష్ట్రం అధోగతి

- రాష్ట్ర ప్రభుత్వంపై కేసీఆర్ ఫైర్
- కగార్ ఆపరేషన్ ఆపాలని కేంద్రానికి డిమాండ్

**సహనం వందే వరంగల్**

'హైడ్రా పేరు చెప్పి పేదల ఇళ్లు కూలగొడుతున్నారు. తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలబెడితే, ఇప్పుడు 14వ స్థానానికి తీసుకెళ్లిపోయారు. నా కళ్ల ముందు తెలంగాణ పరిస్థితి ఇలా అవుతుంటే బాధ కలుగుతోంది. మరో రెండున్నేళ్లలో ఇక ఏమీ చేయగలుగుతార'ని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తి సభలో తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత దుస్థితిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, వెనుకబాటు తీరుపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, 'నా కళ్ల ముందే తెలంగాణ ఇలా కావడం నాకు దుఃఖం కలిగిస్తోంద'న్నారు. పేదల ఇళ్లు కూల్చొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

### కగార్ ఆపరేషన్ పై మండిపాటు..

ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న 'కగార్' ఆపరేషన్‌పై కేసీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. 'కగార్ అనే ఆపరేషన్‌తో ఛత్తీస్‌గఢ్‌లో యువకులను ఊచకోత కోస్తున్నారు. ఈ ఆపరేషన్‌ను వెంటనే ఆపేయాలి. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాల'ని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ కిట్స్ నిలిపివేతపై ఆగ్రహం..

'కేసీఆర్ కిట్స్‌ను ఎందుకు బంద్ చేశారు? ఎవరైనా వాటిని ఆపుతారా? వైఎస్సార్ ఆరోగ్యశ్రీని తీసుకొచ్చారు. అది మంచి పథకమని నేను కొనసాగించాను. ఆరోగ్యశ్రీ పథకం పేరు కూడా మార్చకుండా మేం కొనసాగించాం. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని చూస్తున్నారు. ఇది సాధ్యమా?' అని కేసీఆర్ ప్రశ్నించారు.

### తెలంగాణను ఆగమాగం చేశారు..

'తెలంగాణలో ఆర్థిక పరిస్థితిని పూర్తిగా దెబ్బతీశారు. పరిపాలన చేయడం రాక రాష్ట్రాన్ని ఆగమాగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలు ఎలా ఉండేవి? ఇప్పుడు భూముల ధరలు ఎక్కడికి పోయాయి? ఎందుకు కొనుక్కోవడం లేదు? ఒక్క ఏడాదిలో ఇంతలా మారిపోయిందా?" అని ప్రశ్నించారు. 'పవర్ కట్స్, మోటర్లు కాలిపోతున్నాయి. లంచాలు పెరుగుతున్నాయి. ఐదేళ్లలో ప్రతి ఇంటికి నల్లా రాకపోతే తర్వాతి ఎన్నికల్లో పోటీ చేయమని చెప్పి చేసి చూపించాం. మంచినీళ్లు, కరెంట్ పోతున్నాయి. వడ్లు కొనే దిక్కు లేదు. 2014 కంటే ముందు పరిస్థితులు వస్తున్నాయి. ఇది కాంగ్రెస్ అసమర్థత కాదా?' అని కేసీఆర్ నిలదీశారు.

### కాంగ్రెస్ హామీలపై ఎద్దేవా...

'లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో ఉన్న దేవుళ్లందరిపైనా ఒట్లు వేశారు. మహిళలే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వద్దని అంటున్నారు. మాట్లాడితే కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారు. ఆశపడి కాంగ్రెస్ ను నమ్మి ప్రజలు మోసపోయారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు. అప్పు పుట్టడం లేదని ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అంటున్నార'ని కేసీఆర్ ఎద్దేవా చేశారు. 'ఏడాదిన్నరగా కాంగ్రెస్ ఎన్ని హామీలు ఇచ్చింది? ఏమి చేసింది? గోల్ మాల్ చేయడంలో కాంగ్రెస్ ను మించినవాళ్లు లేరు. ఇక్కడ ఉన్నవాళ్లు చాలరని ఢిల్లీ నుంచి గాంధీలు వచ్చి డ్యాన్స్‌లు చేసి హామీలు ఇచ్చారు. పెన్షన్లు పెంచుతామన్నారు. స్కూటీలు కొనిస్తామన్నారు. జాబ్ కార్డులు ఇస్తామన్నారు. ఇచ్చారా? కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది. అవన్నీ చేసిందా? 420 హామీలు ఇచ్చారు. కళ్యాణ లక్ష్మీకి కేసీఆర్ లక్ష రూపాయలే ఇస్తున్నారు. మేము వస్తే తులం బంగారం కూడా ఇస్తామన్నారు. ఏమైంది?' అని కేసీఆర్ ప్రశ్నించారు.

# ఉగ్రదాడికి స్థానికుల సహకారం



**సహనం వందే, పహల్గామ్**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన భీకర ఉగ్రదాడి వెనుక 15 మంది స్థానికులు టెర్రరిస్టులకు సహకరించినట్లు విచారణలో వెల్లడైంది. టెర్రరిస్టులకు పథకం రూపొందించడంలోనూ, అమలు చేయడంలోనూ స్థానిక ఓవర్‌గ్రౌండ్ వర్కర్స్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడిలో పాకిస్థాన్ ఉగ్రవాదులు ఏకే-47, ఎం4 రైఫిళ్లతో దాడి చేసి అనేక మంది పౌరులను, భద్రతా సిబ్బందిని హతమార్చారు. ఈ దాడి స్థానిక సహకారం లేకుండా సాధ్యం కాదని విచారణలో వెల్లడైంది. ఎలక్ట్రానిక్ సర్వైలెన్స్ ఆధారంగా దక్షిణ కాశ్మీర్‌కు చెందిన 15 మంది స్థానికులు ఈ దాడికి సంబంధించిన ప్రధాన సూత్రధారులని తేలింది. వీరిలో ఐదుగురు ప్రధాన నిందితులుగా ఉన్నారు, మరో పదిమందిని ప్రశ్నిస్తున్నారు.

### ఆయుధాలు... ఆశ్రయంలో సహకారం

విచారణలో బయటపడిన వివరాల ప్రకారం... ఈ 15 మంది స్థానికులు ఉగ్రవాదులకు ఆయుధాలు, ఆశ్రయం ఇతరత్రా సాయం అందించారు. దాడికి ముందు ఒక వారం పాటు పాకిస్థాన్ ఉగ్రవాదులకు సహకరించినట్లు తెలిసింది. దాడి సమయంలో వీరి ఫోన్‌లు ఆ స్థలంలో యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఒక చోట పాకిస్తాన్ ఉగ్రవాదులకు సాయం చేసినట్లు స్పష్టమైన సమాచారం లభించింది.

### మేం చేయలేదు...

ఈ దాడి బాధ్యతను మొదట ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) స్వీకరించినప్పటికీ, తర్వాత వారు ఈ ప్రకటనను భారత్ రూపొందించిన సైబర్ దాడిగా పేర్కొంటూ వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో భారత భద్రతా బలగాలు 175 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని, ఉగ్రవాద నిరోధక చర్యలను తీవ్రతరం చేశాయి. కాగా,ఈఘటన తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ఉద్రిక్తతలు పెరిగాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు భయాందోళనకు గురవుతున్నారు. పహల్గామ్ నుంచి పర్యాటకులను సురక్షితంగా తరలించేందుకు అదనపు విమాన సర్వీసులను ఏర్పాటు చేయాలని విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ అయ్యాయి.